సాక్షి
నిజామాబాద్
సోమవారం ၊ 24 ၊ మార్చి ၊ 2025



కోర్టు దూరం.. ప్రజలకు భారం
జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం భీమ్‌గల్‌తోపాటు ఐదు మండలాల ప్రజలు ఎదురు చూస్తూనే ఉన్నారు.
- 8లో ▸

రంజాన్ వేళలు
ఇఫ్తార్ సోమ : 6:33 | సహర్ మంగళ :4:54

వాతావరణం
గరిష్ఠం/కనిష్ఠం 38.5 /20.8
ఉదయం ఈదురు గాలులు వీస్తాయి. పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలున్నాయి. రాత్రి ఉక్కపోతగా ఉంటుంది.

న్యూస్‌రీల్

బ్యాక్ వాటర్‌లో భారీ జెల్లలు



డొంకేశ్వర్(ఆర్మూర్): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు బ్యాక్ వాటర్‌లో మత్స్యకారుల వలకు భారీ జెల్లలు చిక్కుతున్నాయి. వేసవిలో మాత్రమే జెల్లలు లభిస్తాయని, ప్రస్తుతం వలకు చిక్కుతున్న చేపలు భారీ సైజులో ఉంటున్నాయని మత్స్యకారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జెల్లలకు కోల్‌కతాలో మంచి డిమాండ్ ఉంటుందని, కిలో రూ.500కుపైగానే పలుకుతుందని తెలిపారు. డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ బ్యాక్‌వాటర్‌లో చేపల వేటకు వెళ్లిన ఇద్దరు మత్స్యకారులకు భారీ జెల్లలు చిక్కాయి. ఒక్కోటి నాలుగు అడుగుల పొడవు, పది కిలోల పైనే ఉన్నాయని, వీటిని వ్యాపారులకు విక్రయించామని మత్స్యకారుడు మోహన్ తెలిపారు.

గిరిజన వర్సిటీ తొలి వీసీకి సన్మానం



బోధన్: రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రారంభించిన సమ్మక్క సారక్క గిరిజన యూనివర్సిటీ తొలి వైస్ చాన్స్‌లర్‌గా బోధన్‌కు చెందిన వైఎల్ శ్రీనివాస్ ఇటీవల నియామకమైన విషయం తెలిసిందే. ఆదివారం ఆయన కుటుంబసభ్యులతో కలిసి పట్టణ కేంద్రంలోని స్వగృహానికి వచ్చారు. ఈ సందర్భంగా ట్రస్మా ప్రతినిధులు వీసీ దంపతులను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. వీసీని కలిసిన వారిలో సాలూర తహసీల్దార్ శశిభూషణ్ దంపతులు, ట్రస్మా జిల్లా అధ్యక్షుడు కొడాలి కిశోర్, ఇందూర్ హైస్కూల్ ఇంచార్జి స్వాతి, అంజలి, మున్సిపల్ మాజీ చైర్మన్ మహ్మద్ గౌసొద్దీన్, టీపీసీసీ ప్రతినిధి బీ గంగాశంకర్, లయన్స్ కంటి ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ నర్సింహారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తదితరులు ఉన్నారు.

సాంకేతికతతో మెరుగైన సేవలు



సుభాష్‌నగర్: సాంకేతికతను అందిపుచ్చుకొని వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ సరఫరా చేస్తున్నామని ఎన్పీడీసీఎల్ ఎస్ఈ రాపెల్లి రవీందర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి పనిలో అధునాతన సాంకేతిక పద్ధతులను అవలంబిస్తున్నామని పేర్కొన్నారు. విద్యుత్ సరఫరాలో మరింత నాణ్యతను మెరుగుపర్చడానికి సిస్టమ్ యావరేజ్ ఇంటరాప్షన్ డ్యూరేషన్ ఇండెక్స్ (సైది), సిస్టమ్ యావరేజ్ ఇంటరాప్షన్ ఫ్రీక్వెన్సీ ఇండెక్స్ (సైఫీ)గా తీర్చిదిద్దామని తెలిపారు.

సైది, సైఫీతో ప్రయోజనాలు
- విద్యుత్ అంతరాయం ఏర్పడి ఫీడర్లపై దృష్టి సారించి తగిన చర్యలు చేపట్టడం.
- సమస్యను తక్కువ సమయంలో గుర్తించి త్వరగా మరమ్మతులు చేపట్టడం.
- ఫాల్ట్ డిటెక్షన్, రియల్–టైమ్ మానిటరింగ్ చేయడం.
- భవిష్యత్‌లో అంతరాయాలు జరగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసే ఆస్కారం ఉంటుంది.

రుణాల పంపిణీలో రికార్డు





- రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచిన నిజామాబాద్ జిల్లా
- గడువుకు ముందే పూర్తయిన బ్యాంకు లింకేజీ రుణాల టార్గెట్
- మహిళా సంఘాలకు రూ.1229.24 కోట్లు పంపిణీ

డొంకేశ్వర్(ఆర్మూర్): బ్యాంకు లింకేజీ రుణాల పంపిణీలో నిజామాబాద్ జిల్లా రాష్ట్రానికి ఆదర్శంగా నిలిచింది. గడువుకు ముందే అధికారులు రికార్డు స్థాయిలో రుణాలను పంపిణీ చేశారు. అత్యధిక రుణాలిచ్చిన జాబితాలో నిజామాబాద్ జిల్లా నంబర్ వన్ స్థానంలో ఉంది. సంఘాలకు రుణాలిచ్చి వారి ఆర్థికాభివృద్ధికి పాటుపడుతున్న ఐకేపీ ఉద్యోగులు ప్రశంసలు సైతం అందుకున్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరానికి జిల్లాకు బ్యాంకు లింకేజీ టార్గెట్ రూ.1,228.71 కోట్లుగా నిర్దేశించారు. వీటిని 20,350 ఎస్‌హెచ్‌జీలకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇది గతేడాది లక్ష్యంతో పోలిస్తే దాదాపు రూ.200 కోట్లు ఎక్కువ. కొండంత లక్ష్యాన్ని చూసి బెదరకుండా ఐకేపీ అధికారులు, ఉద్యోగులు సమష్టిగా పని చేశారు. క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమీక్షలు జరిపి ఎస్‌హెచ్‌జీలకు రుణాలను అందజేశారు. ఫలితంగా గడువుకు ఇంకా పది రోజులు మిగిలి ఉండగానే టార్గెట్‌ను మించారు. ఇప్పటి వరకు 14,725 ఎస్‌హెచ్‌జీలకు రూ.1229.24 కోట్ల (100.04 శాతం) రుణాలను పంపిణీ చేశారు.

90 శాతం చేరుకున్న స్త్రీనిధి రుణాలు
స్త్రీనిధి ద్వారా కూడా మహిళా సంఘాలకు రుణాలు అందజేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం రూ.211 కోట్లు పంపిణీ చేయాలని జిల్లాకు లక్ష్యం ఉండగా, ఇప్పటి వరకు రూ.198 కోట్లు (90 శాతం) 23,780 మంది మహిళలకు అందజేశారు. ఈ నెలాఖరు నాటికి టార్గెట్‌ను పూర్తి చేయడానికి వెనుకబడిన మండలాల్లో అధికారులు పర్యటిస్తున్నారు.

వెనుకబడిన ఎనిమిది మండలాలు
బ్యాంకు లింకేజీ రుణాలిచ్చే విషయంలో జిల్లాలో కొన్ని మండలాలు వెనుకబడి ఉన్నాయి. ఇందులో ధర్పల్లి, భీమ్‌గల్, ఇందల్వాయి, రెంజల్, మోర్తాడ్, సిరికొండ, మాక్లూర్, వర్ని ఉన్నాయి. అలాగే లక్ష్యాన్ని చేరుకున్న జాబితాలో మెండోరా, ముప్కాల్, ఏర్గట్ల, బాల్కొండ, జక్రాన్‌పల్లి, డిచ్‌పల్లి, ఆర్మూర్, నవీపేట్, మోస్రా, ఎడపల్లి, నందిపేట్, కమ్మర్‌పల్లి, బోధన్, నిజామాబాద్ రూరల్, వేల్పూర్, రుద్రూర్, మోపాల్ ఉన్నాయి. లక్ష్యానికి చేరువలో చందూర్, కోటగిరి మండలాలు ఉన్నాయి.

అందరి కృషితో సాధ్యమైంది



గ్రామ, మండల, జిల్లా స్థాయిలో పని చేస్తున్న ఐకేపీ సిబ్బంది కృషితోనే లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యమైంది. రాష్ట్రస్థాయిలో ఇతర జిల్లాల కన్నా ఎక్కువ రుణాలిచ్చాం. మిగిలిన పది రోజుల్లో కూడా ఇంకా బ్యాంకు లింకేజీ రుణాలు ఇవ్వడానికి ప్రయత్నం చేస్తాం. స్త్రీనిధి లక్ష్యాన్ని కూడా చేరుకుంటాం. – సాయాగౌడ్, డీఆర్డీవో, నిజామబాద్

'రూ.వెయ్యి, రెండువేల పన్ను చెల్లించాల్సి ఉన్నా అధికారులు వేధిస్తున్నారు. ఫోన్‌లు చేసి మరీ అడుగుతున్నారు. కానీ పెద్ద మొత్తంలో బకాయిలున్నవారిని ఏమీ చేయడం లేదు. వారిని ఎందుకు వదిలివేస్తున్నారు. అందరికీ ఒకే న్యాయం ఉండాలి కదా సార్..' – కార్పొరేషన్ కమిషనర్‌కు ఇద్దరు వ్యక్తుల ప్రశ్న

'బల్దియాకు అందరూ పన్ను చెల్లించాల్సిందే. ఎవరికీ మినహాయింపు ఉండదు. బాధ్యతగల పౌరులు పన్నులు వెంటనే చెల్లించాలి. చెల్లించని వారిని ఉపేక్షించేది లేదు. దుకాణాలు సీజ్ చేస్తున్నాం. జరిమానాలు విధిస్తున్నాం'. – కమిషనర్ దిలీప్ ఇచ్చిన సమాధానమిది.

బాధ్యత మరిచారా?

- ఇప్పటికీ పన్ను చెల్లించని పలువురు తాజామాజీ ప్రజాప్రతినిధులు
- పెద్దలకో న్యాయం.. సామాన్యులకో న్యాయమా? అంటున్న నగరవాసులు





నిజామాబాద్ సిటీ: పన్ను పకడ్బందీగా వసూలు చేస్తున్నామని, బాధ్యతలగల పౌరులు పన్ను చెల్లించి అభివృద్ధికి సహకరించాలని అధికారులు కోరుతుండగా.. ఇతరులకు ఆదర్శంగా ఉండాల్సిన పలువురు ప్రజాప్రతినిధులు పెడచెవిన పెడుతున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో కమిషనర్ నుంచి కిందిస్థాయి ఉద్యోగి వరకు సెలవు రోజుల్లో సైతం పన్ను వసూళ్లలో నిమగ్నమయ్యారు. పన్ను చెల్లించాలని ప్రధాన కూడళ్లలో ఫ్లెక్సీలు పెట్టి విస్తృత ప్రచారం చేస్తున్నారు. అధికారులు, ఉద్యోగులు బతిమిలాడడం, హుంకరించడం సామాన్యుల వరకే పరిమితమవుతోంది. పన్నులు చెల్లించి ఆదర్శంగా ఉండాల్సిన వారు బల్దియాకు భారంగా మారుతున్నారు. వారు తాజా మాజీ ప్రజాప్రతినిధులు కావడంతో బిల్ కలెక్టర్లు అటువైపు కన్నెత్తికూడా చూడటం లేదు. పన్ను చెల్లించాలని వారిని అడిగేందుకు సాహసం చేయలేకపోతున్నారు. ఇప్పటికీ పన్ను చెల్లించని ప్రముఖుల్లో తాజామాజీ మేయర్ దండు నీతూకిరణ్, డిప్యూటీ మేయర్ ఇద్రీస్‌ఖాన్ ఉండడం గమనార్హం.

ఇలా తాజామాజీ కార్పొరేటర్లతోపాటు వారి బంధువులు, ఆయా పార్టీలకు చెందిన నాయకులు పన్ను చెల్లించని వారిలో ఉన్నారు. మున్సిపల్ కమిషనర్ స్థాయి ఉన్నతాధికారి సైతం పలుమార్లు పన్ను చెల్లించాలని అడిగినా వారు ఖాతరు చేయడం లేదని తెలిసింది. అయితే తక్కువ మొత్తం పన్ను చెల్లించాల్సి ఉన్న వారి ఇళ్లకు వెళ్లడంతోపాటు ఫోన్‌లు చేస్తున్న పన్ను వసూలు సిబ్బంది అటువైపు కన్నెత్తి చూడడం లేదు. దీంతో నగరవాసులు పెద్దలకో న్యాయం, సామాన్యులకో న్యాయమా? అంటు వాపోతున్నారు.

- నగరంలోని 52వ డివిజన్ పరిధిలో ఉన్న మమ్మదేవీనగర్‌లో దండు నీతూకిరణ్‌కు చెందిన ఇల్లు ఉంది. దీనికి సంబంధించి పన్ను రూ.1,73,427 పెండింగ్‌లో ఉంది. ఈ పన్ను కేవలం ఒక ఇంటిది మాత్రమే. వారికి నగరంలో మరికొన్ని ఇళ్లు ఉన్నాయి. వాటికి సంబంధించిన పన్ను సైతం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం.
- తాజా మాజీ డిప్యూటీ మేయర్ ఇద్రీస్‌ఖాన్ కూడా రూ.5 లక్షలకు పైగా ఆస్తిపన్ను చెల్లించాల్సి ఉంది.
- 22వ డివిజన్ తాజామాజీ కార్పొరేటర్ లావణ్య కుటుంబ సభ్యుడికి చెందిన కమర్షియల్ కాంప్లెక్స్‌కు బకాయిలు రూ.3 లక్షల 30 వేలు పెండింగ్ ఉన్నా చెల్లించడం లేదు.

కమనీయం.. శ్రీవారి కల్యాణం

- వైభవంగా ఇందూరు తిరుమల బ్రహ్మోత్సవాలు
- సినీ ప్రముఖుల సందడి



రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నర్సింగ్‌పల్లిలోని ఇందూరు తిరుమల వేంకటేశ్వర స్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం శ్రీవారి కల్యాణం కనుల పండువగా జరిగింది. అంతకుముందు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను ఊరేగింపుగా మండపానికి తీసుకొచ్చారు. స్వామి వారి కల్యాణం.. లోక కల్యాణమని, ఆ ఘట్టాన్ని తిలకిస్తే సకల పాపాలూ తొలగిపోతాయని దేవనాథ జీయర్ స్వామి, గంగోత్రి రామానుజదాసు స్వామి ప్రవచించారు. కల్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతిరెడ్డి రథోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రముఖ నిర్మాతలు దిల్ రాజు, శిరీష్, నర్సింహారెడ్డి, విజయసింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాములు, నరాల సుధాకర్, పృథ్వీ, నర్సారెడ్డి, ప్రసాద్, రాజేశ్వర్, రమేశ్, భాస్కర్, నరేందర్, మురళి, రాజేశ్వర్, యాజ్ఞాచార్యులు శిఖామణి, సత్యనారాయణ స్వామి, శ్రీకర్ కుమారాచార్యులు, రోహిత్ కుమారాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



తరలివచ్చిన సినీ ప్రముఖులు
ఇందూరు తిరుమలలో నిర్వహించిన శ్రీవారి కల్యాణోత్సవానికి సినీ ప్రముఖులు హాజరయ్యారు. ప్రముఖ దర్శకులు వంశీ పైడిపల్లి, సతీశ్ వేగేశ్న, రచయిత చిన్నికృష్ణ, జబర్దస్త్ వేణు (బలగం), బలగం ఫేమ్ మధు, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులకు అండగా ఉంటాం



ధర్పల్లి మండలం వాడి శివారులో వరిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భూపతిరెడ్డి

ధర్పల్లి/సిరికొండ: అధైర్య పడొద్దని అకాల వర్షాల కారణంగా పంట నష్టపోయిన ప్రతి రైతునూ ప్రభుత్వం ఆదుకుంటుందని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి భరోసా ఇచ్చారు. ధర్పల్లి, సిరికొండ మండలాల్లోని మద్దుల్‌తండా, వాడి, హొన్నాజీపేట్, సీతాయిపేట్, చీమన్‌పల్లి, కొండూర్ గ్రామాల్లో ఆదివారం ఆయన పర్యటించి దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ధర్పల్లి, సిరికొండ మండలాల్లోనే పంట నష్టం ఎక్కువగా ఉందన్నారు. పంట నష్టంపై వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావును కలిసి వివరించినట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా పంటల నష్టం పై పూర్తిస్థాయి నివేదిక ప్రభుత్వానికి అందగానే నష్టపరిహారం పై ఒక నిర్ణయం తీసుకుంటారన్నారు. గతేడాది రబీ సీజన్‌లో వడగళ్ల వానతో పంటలు దెబ్బతిని నష్టపోయిన రైతులకు పరిహారం ఇచ్చామని గుర్తు చేశారు. ఆయన వెంట నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్‌రెడ్డి, బాడ్సి శేఖర్‌గౌడ్, ధర్పల్లి, సిరికొండ మండలాల పార్టీ అధ్యక్షులు ఆర్మూర్ బాలరాజ్, బాకారం రవి, సొసైటీ చైర్మన్ గంగాధర్, ఏఎంసీ డైరెక్టర్లు సంపత్‌రెడ్డి, ముత్తెన్న, ఏడీఏ ప్రదీప్‌కుమార్, ఏవో నర్సయ్య, నాయకులు ఉన్నారు.

త్వరితగతిన ధాన్యం కొనుగోళ్లు
ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు చేస్తామని ఎమ్మెల్యే భూపతిరెడ్డి అన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో సిరికొండ మండలం కొండూర్‌లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోకుండా ప్రభుత్వ కేంద్రాల్లోనే విక్రయించాలని సూచించారు.

అకాల వర్షం ఆగం చేసింది..



ఎమ్మెల్యే ఎదుట రోదిస్తున్న మహిళా రైతు రాజమణి


తనకున్న ఎకరం భూమిలో సాగు చేసిన వరి పూర్తిగా దెబ్బతిన్నదని ధర్పల్లి మండలం వాడి గ్రామానికి చెందిన మహిళా రైతు జిన్న రాజమణి ఎమ్మెల్యే ఎదుట రోదించింది. పంట పొట్టదశలో ఉండగా బోరు ఎత్తిపోయిందని, మరో బోరుకు రూ.15వేలు అద్దె చెల్లించి నీరందించిన తరువాత అకాల వర్షం కురిసిందని ఆమె కన్నీటిపర్యంతమైంది. తన భర్త జీవనోపాధికోసం గల్ఫ్‌కు వెళ్లాడని, తమది పేద కుటుంబమని తెలిపింది. దీంతో ఎమ్మెల్యేతోపాటు అధికారులు చలించారు. నష్టపరిహారం అందేలా చూస్తామని ఆమెకు భరోసా ఇచ్చారు.

అడవిలో అప్రమత్తం

- ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పకడ్బందీగా సంరక్షణ చర్యలు
- వన్యప్రాణుల దాహార్తిని తీర్చేందుకు సాసర్ పిట్‌లు
- రాత్రి వేళల్లో పెట్రోలింగ్
- గ్రామాల్లో అవగాహన సదస్సుల నిర్వహణ



ఇందల్‌వాయి రేంజ్ పరిధిలో సాసర్ పిట్‌లో నీరు నింపుతున్న సిబ్బంది



త్రయంబక్‌పేట అడవిలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్‌సెట్

ఇందల్వాయి: రోజురోజుకూ ఎండ తీవ్రత పెరుగుతుండడంతో అటవీఅధికారులు అప్రమత్తమయ్యారు. వేసవిలో వృక్ష సంపదతోపాటు వన్యప్రాణులకు ముప్పు పొంచి ఉండడంతో జిల్లాలోనే ఎక్కువ అటవీ విస్తీర్ణం ఉన్న ఇందల్‌వాయి ఫారెస్ట్ రేంజ్ పరిధిలో జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఎండలు పెరిగితే అడవిలో ఆకులు రాలడం, తునికాకు సేకరణకు వెళ్లే వారి సంఖ్య పెరగడం, నీటి కోసం వన్యప్రాణులు అల్లాడడం సాధారణం. అటవీ ప్రాంతంలోకి వెళ్లే వారి అజాగ్రత్త, అవగాహనారాహిత్యం కారణంగా అగ్ని ప్రమాదాలు చోటు చేసుకోకుండా, నీటి కోసం తిరిగే వన్యప్రాణులను వేటగాళ్లు బలి తీసుకోకుండా ఫారెస్ట్ అధికారులు పకడ్బందీ చర్యలు చేపడుతున్నారు.

రేంజ్ పరిధి
రేంజ్ పరిధిలో ఇందల్‌వాయి, ధర్పల్లి, సిరికొండ, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి మండలాల్లో కలిపి 35 వేల హెక్టార్ల అటవీ భూమి ఉంది. 6 సెక్షన్‌లు, 35 బీట్లుగా విభజించి 18 మంది బీట్ ఆఫీసర్లు, ఇద్దరు సెక్షన్ అధికారులు, ఐదుగురు బేస్ క్యాంప్, ముగ్గురు స్ట్రైకింగ్ ఫోర్స్, ఒక డిప్యూటీ రేంజ్ అధికారులు బాధ్యతలను నిర్వర్తిస్తున్నారు.

37 చోట్ల సాసర్ పిట్‌లు
రేంజ్ పరిధిలో చిరుతలు, దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, సాంబార్‌లు, రేసు కుక్కలు, మనుబోతులు, ఎలుగుబంట్లు, కుందేళ్లు, అడవి పందుల వంటి వన్యప్రాణులు ఉన్నాయి. వేసవిలో వీటి సంరక్షణ కోసం కీలకమైన 37 చోట్ల తాగునీటి కోసం సాసర్ పిట్‌లు ఏర్పాటు చేసి ప్రతిరోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. మరో ఆరు చోట్ల ప్రయోగాత్మకంగా సోలార్ పంప్ సెట్‌తో సాసర్ పిట్‌లు నిర్వహిస్తున్నారు. వర్షపు నీటిని నిల్వ చేసేందుకు చిన్నచిన్న కుంటలు తవ్వించారు. వన్యప్రాణుల వధపై ప్రత్యేక నిఘా ఉంచడంతోపాటు వేటగాళ్లపై వన్య ప్రాణుల చట్టం కింద కేసులు నమోదు చేసేందుకు వెనకాడటం లేదు. వేట మాంసం మంచిదనే అపోహను తొలగించేందుకు గ్రామాల్లో అవగాహన సమావేశాలు నిర్వహిస్తున్నారు.

అటవీ సంరక్షణ చర్యలు ఇలా..
ఇందల్‌వాయి రేంజ్ పరిధిలో నిత్యం ఏదో ఓ చోట అడవుల ఆక్రమణ, అడవులకు నిప్పు పెట్టడం వంటి ఘటనలు చోటు చేసుకుంటాయి. వీటిని అరికట్టేందుకు ఫారెస్ట్ అధికారులు ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తున్నారు. రాత్రి వేళల్లో ప్రతిరోజూ పెట్రోలింగ్ నిర్వహించడంతోపాటు అవగాహన సదస్సులు ఏర్పాటు చేస్తూ అటవీ సంరక్షణలో ప్రజలను భాగస్వాములను చేస్తున్నారు. అటవీభూమి ఎక్కడైనా ఆక్రమణకు గురైనా, అగ్ని ప్రమాదం చోటు చేసుకున్నా వెంటనే అధికారులకు సమాచారం అందుతోంది. అగ్ని ప్రమాదాలు జరగకుండా ముందస్తుగానే ఫైర్‌లైన్ సేఫ్టీ సిబ్బందితో నిప్పు వ్యాపించకుండా జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఈ చర్యలు ఫలితాలను ఇస్తున్నట్లు ఎఫ్ఆర్‌వో రవి మోహన్ భట్ తెలిపారు.

ప్రజలు భాగస్వాములు కావాలి
ప్రతి ప్రాంతంలో అటవీ విస్తీర్ణం 33 శాతం ఉండాలి. తెలంగాణాలో 24.69 శాతం ఉంది. అటవీ విస్తీర్ణాన్ని మరింత పెంచేందుకు అటవీశాఖ కృషి చేస్తోందని. దీనికి ప్రజలు సహకరించాలి. ఆక్రమణలు, వన్య ప్రాణుల వేటపై సమాచారం అందించాలి. అడవులతోనే మానవాళి మనుగడ అని గుర్తించాలి. – రవి మోహన్‌భట్, ఎఫ్ఆర్వో, ఇందల్వాయి

కలగానే బీసీ గురుకుల సొంత భవనాలు!

- గతంలో నిధులు కేటాయించినా ముందుకు పడని అడుగులు
- ప్రస్తుత బడ్జెట్‌లో నిధులు కేటాయించని ప్రభుత్వం
- కొత్తగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు ప్రస్తావన



మోర్తాడ్‌లోని అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ గురుకుల పాఠశాల

మోర్తాడ్(బాల్కొండ): వెనుకబడిన తరగతుల విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం కలగానే మిగిలిపోనుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో బీసీ గురుకుల పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించే అంశంపై ప్రభుత్వం ఎలాంటి ప్రస్తావన తీసుకరాలేదు.

జిల్లాలో మోర్తాడ్, ఎడపల్లి, ఆర్మూర్, బాల్కొండ, కుద్వాన్‌పూర్, బోధన్, శ్రీరాంపూర్, చీమన్‌పల్లి, నిజామాబాద్‌లో బాలబాలికలకు వేర్వేరుగా పాఠశాలలను నిర్వహిస్తున్నారు. 2017–18 విద్యా సంవత్సరంలో ఈ బీసీ గురుకుల పాఠశాలలను ప్రారంభించగా ఎక్కడ కూడా సొంత భవనాలు లేవు. 2024–25 బడ్జెట్‌లో రూ.1,546 కోట్లు కేటాయించినా ఎక్కడ కూడా భవనాలు నిర్మించలేదు. దీంతో అద్దె భవనాల్లోనే వాటిని కొనసాగిస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం బీసీ గురుకుల పాఠశాలల ప్రారంభానికి చూపిన ఆసక్తి.. సొంత భవనాల నిర్మాణంపై చూపలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం భవనాల నిర్మాణం కోసం నిధులు కేటాయించినా అడుగులు మాత్రం ముందుకు పడలేదు.

తెరపైకి ఇంటిగ్రేటెడ్..
కొత్తగా ఒక్కో నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటు, భవనాల నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇచ్చింది. ఇంటిగ్రేటెడ్ పాఠశాలలకు సొంత భవనాలను నిర్మించేందుకు రూ.11,600ల కోట్లు కేటాయించినట్లు ఆర్థిక మంత్రి వెల్లడించారు. ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటును తెరపైకి తీసుకరావడంతో గతంలో ఏర్పాటు చేసిన గురుకుల పాఠశాలలకు సొంత భవనాల నిర్మాణం మరుగునపడినట్లేనా అనే సందేహం వ్యక్తమవుతోంది.

క్లుప్తంగా

'మీ సేవ'లో కొత్తగా 9 సేవలు

కమ్మర్‌పల్లి: మీ సేవ కేంద్రాల్లో కొత్తగా తొమ్మిది రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. రెవెన్యూ పరిధిలోని సేవలతోపాటు అటవీశాఖకు సంబంధించిన నూతన ఆప్షన్లను జోడించింది. కాగా, ప్రభుత్వం మీ సేవ సర్వర్ సమస్యలను పరిష్కరించడంతోపాటు నిర్వాహకులు, ఆపరేటర్లకు నూతన సర్వీసులపై అవగాహన కల్పిస్తే వినియోగదారులకు మరింత నాణ్యమైన సేవలు అందనున్నాయి. రెవెన్యూ శాఖ పరిధిలో గ్యాప్ సర్టిఫికెట్, పౌరుల పేరు మార్పిడి, లోకల్ క్యాండిడేట్ సర్టిఫికెట్, మైనారిటీలకు కుల, ఆదాయ ధ్రువపత్రాల పునఃజారీ, క్రీమీలేయర్, నాన్ క్రీమీలేయర్, వయోవృద్ధుల నిర్వహణ కేసులు, పర్యవేక్షణ వ్యవస్థ, అటవీశాఖ పరిధిలో వన్యప్రాణుల దాడిలో మరణించిన వ్యక్తులు, జంతువులకు సంబంధించి అందించే నష్టపరిహారం, సామిల్, టింబర్ డిపో న్యూ ఎస్టాబ్లిష్‌మెంట్, రెన్యువల్ నూతనంగా అందనున్నాయి.

నాడు సర్పంచ్‌గా.. నేడు వ్యవసాయ క్షేత్రంలో..

- యాడారంలో రెండు ఎకరాల్లో మామిడి మొక్కల సాగు



బీబీపేట: సర్పంచ్‌గా ఐదేళ్లు గ్రామానికి సేవ చేసిన సర్పంచ్ ప్రస్తుతం వ్యవసాయ క్షేత్రంలో వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. వివరాల్లోకి వెళ్తే మండలంలోని యాడారం గ్రామ మాజీ సర్పంచ్ చెన్నమనేని వెంకట్‌రావు గత ఐదేళ్లుగా గ్రామ సర్పంచ్‌గా కొనసాగారు. అయితే సర్పంచ్‌ల పదవీ కాలం ముగియడంతో అప్పటికే రైతు అయిన వెంకట్‌రావు కొత్త ఆలోచనతో ఇంటి పక్కనే ఉన్నటువంటి రెండు ఎకరాల్లో మామిడి మొక్కలతోపాటు కొబ్బరి మొక్కలు పెంచుతున్నాడు. ఉదయమే తనకున్న ఐదు ఎకరాల వరి పొలం వద్దకు వెళ్లి పనులు చేసుకొని వచ్చి వెంటనే మామిడి మొక్కలకు నీళ్లు అందిస్తున్నాడు. ప్రభుత్వం నుంచి సబ్సిడీలో డ్రిప్ పరికరాలు అందకపోవడంతో మండుతున్న ఎండల్లో సైతం ప్రతి మొక్కకు కాలువల ద్వారా నీళ్లు అందిస్తున్నాడు. సర్పంచ్‌గా ఉన్నన్ని రోజులు సైతం తన వ్యవసాయ పనులు చేసుకుంటూనే గ్రామ పాలన అందించాడు. పదవీకాలం ముగియడంతో పొలం బాట పట్టాడు. ఇంటి పక్కనే కావడంతో భార్యాభర్తలు అటు కూరగాయలు సైతం పండిస్తున్నారు.

కోర్టు దూరం.. ప్రజలకు భారం

- భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు విజ్ఞప్తులు
- ఆర్మూర్‌లో నిర్వహణతో ఇక్కట్లుపడుతున్నామని ఆవేదన
- భీమ్‌గల్ పరిధి మండలాల్లో 2,500కు పైగా క్రిమినల్ కేసుల పెండింగ్



ఆర్మూర్ పట్టణంలోని కోర్టు

ఆర్మూర్: జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటు కోసం భీమ్‌గల్‌తోపాటు ఐదు మండలాల ప్రజలు ప్రయత్నాలు చేస్తున్నారు. క్రిమినల్, సివిల్ కేసుల విషయంలో ఆర్మూర్ కోర్టుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారు. సిరికొండ, వేల్పూర్, కమ్మర్‌పల్లి, మోర్తాడ్, ఏర్గట్ల మండలాలకు అందుబాటులో ఉండేలా భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు 2007లో మంజూరైంది. కాగా, ఆ కోర్టును ఆర్మూర్‌లో ఏర్పాటు చేయడంతో సమస్య మొదలైంది. ప్రజలు, న్యాయవాదులు, కోర్టు ఉద్యోగులు, పోలీసులు వివిధ కేసుల విషయంలో ఆర్మూర్‌కు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడింది. దూరభారం, సరైన రవాణా వ్యవస్థ లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. దీంతో కోర్టును సాధించుకునేందుకు భీమ్‌గల్ ప్రాంతీయులు ప్రయత్నిస్తున్నారు. ఫలితంగా భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై నివేదిక సమర్పించాలంటూ 2023 నవంబర్ 8న ఆర్మూర్ కోర్టుకు ఆదేశాలు వచ్చాయి. 500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉంటేనే కొత్తగా కోర్టు మంజూరు చేసేందుకు ఆస్కారం ఉంటుంది. కానీ, భీమ్‌గల్ పరిధిలోని ఆరు మండలాలను కలిపి సుమారు 2,500 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉండడంతోపాటు భీమ్‌గల్ మున్సిపాలిటీగా ఏర్పడింది. ఈ గణాంకాల ప్రకారం భీమ్‌గల్‌లో జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ కోర్టు ఏర్పాటుకు అన్ని అర్హతలు ఉన్నాయి. ఈ విషయాలన్నీ తెలంగాణ రాష్ట్ర లా సెక్రటరీకి నివేదిక రూపంలో సమర్పించి భీమ్‌గల్‌కు కోర్టు మంజూరు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ఇబ్బందిగా ఉంది



ఆర్మూర్ కోర్టులో గృహహింస, మెయింటెనెన్స్ కేసు నడుస్తోంది. నేను ఆర్మూర్‌కు వెళ్లాలంటే 62 కి.మీ ప్రయాణించాలి. మా గ్రామం నుంచి ఆర్మూర్‌కు బస్సు సౌకర్యం కూడా లేదు. ఇబ్బందిగా మారుతోంది. అదే కోర్టు భీమ్‌గల్‌లో ఉంటే మాలాంటి వారికి సౌకర్యంగా ఉండేది.
– భూక్య లత, పాకాల, సిరికొండ మండలం

భీమ్‌గల్‌లో ఏర్పాటు చేయాలి



ఆర్మూర్ కోర్టులో క్రిమినల్ కేసులకు నేను హాజరుకావాల్సి ఉంది. మా గ్రామం నుంచి ఆర్మూర్ కోర్టు 53కి.మీ. బస్సు సౌకర్యం సరిగా లేని గ్రామం నుంచి ప్రతినెలా ఆర్మూర్‌కు వెళ్లడం కష్టమవుతోంది. భీమ్‌గల్‌లో కోర్టును ఏర్పాటు చేస్తే అందరికీ సౌకర్యంగా ఉంటుంది.
– లకావత్ గణేశ్, కోనాపూర్, కమ్మర్‌పల్లి మండలం

సరైన నిర్ణయం తీసుకోవాలి



మా గ్రామం నుంచి ప్రతినెలా 64 కిలోమీటర్లు ప్రయాణించి ఆర్మూర్ కోర్టుకు వెళ్లాల్సి వస్తోంది. కేసుల్లో ఉన్న వారే కాకుండా ఉద్యోగులు, న్యాయవాదులకు కూడా దూరభారమవుతోంది. ప్రజల సౌకర్యార్థం ప్రభుత్వం సరైన నిర్ణయం తీసుకోవాలి.
– భూక్య మోహన్, మానాల శివారులోని తండా, కమ్మర్‌పల్లి మండలం

ప్రభుత్వం స్పందించాలి



సివిల్ కేసుల విషయంలో ఆర్మూర్ కోర్టుకు రావడం ఇబ్బందిగా ఉంది. మాకు సౌకర్యంగా ఉండేలా భీమ్‌గల్‌కు కోర్టును మంజూరు చేస్తే దానిని ఆర్మూర్‌లో ఏర్పాటు చేశారు. ప్రభుత్వం స్పందించి భీమ్‌గల్‌లో కోర్టు ఏర్పాటు చేయాలి.
– మోజీరామ్, తూంపల్లి, సిరికొండ మండలం

ఇంటి నుంచే 'ఎల్‌ఆర్‌ఎస్'

- సందిగ్ధంలో దరఖాస్తుదారులు
- సులువుగా ఆన్‌లైన్‌లో రుసుము చెల్లించవచ్చు
- ఈనెల 31 వరకు గడువు

కామారెడ్డి టౌన్ : అక్రమ లే అవుట్లు, ప్లాట్ల క్రమబద్ధీకరణకు ఎల్‌ఆర్‌ఎస్(లే అవుట్ రెగ్యూలరైజేషన్ స్కీం)–2020 పేరిట ప్రభుత్వం అవకాశం కల్పించింది. ఈనెల 31వ తేదీ వరకు తుది గడువుకు ఉండటంతో ఇందుకు అనుగుణంగా అధికారులు చర్యలు చేపడుతున్నారు. ఈ నేపథ్యంలో దరఖాస్తుదారుల్లో కాస్త సందిగ్ధత నెలకొంది. రుసుం చెల్లింపు కోసం ఎక్కడికి వెళ్లాలి, రుసుం ఎంత చెల్లించాలనే విషయాలు తెలియడం లేదు. సాంకేతిక అవగాహన ఉండి స్మార్ట్‌ఫోన్ లేదా కంప్యూటర్ అందుబాటులో ఉంటే ఎల్‌ఆర్‌ఎస్‌కు సంబంధించిన రుసుం చెల్లింపులు చాలా సులభంగా చేయొచ్చు.

ఇలా చేయండి..

గూగుల్ సెర్చ్‌లో ఎల్‌ఆర్‌ఎస్–2020 అని టైప్ చేయాలి. అక్కడ వెల్‌కమ్ టు లే అవుట్ రెగ్యులైజేషన్ స్కీమ్‌పై క్లిక్ చేయాలి. తెలంగాణ డాట్ గౌట్ డాట్ ఇన్ (lrs.telangana.gov.in) వెబ్‌సైట్ లోకి వెళ్లాలి. అక్కడ హోమ్ పేజీలో సిటిజన్ లాగిన్‌ను ఎంచుకోవాలి. ఎల్‌ఆర్‌ఎస్ దరఖాస్తు సమయంలో మనం ఇచ్చిన ఫోన్ నంబర్ ఎంటర్ చేయాలి. ఓటీపీ కోసం అభ్యర్థించిన వెంటనే మన ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని అక్కడ నమోదు చేసి వ్యాలిడేట్ చేసుకోవాలి. వివరాలు చూసుకుని ముందుకు సాగేందుకు ప్రొసీడ్‌ను క్లిక్ చేయాలి. సెల్ఫ్ డిక్లరేషన్‌కు సంబంధించిన అన్ని అంశాలను మనం అంగీకరిస్తూ పేమెంట్ బటన్‌ను క్లిక్ చేయాలి. అక్కడ క్యూఆర్ కోడ్‌ను చూపించే బటన్‌ను నొక్కాలి. ఆ తర్వాత మన ఫోన్ నంబర్‌ను నమోదు చేయాలి. కంటిన్యూ అండ్ పే క్లిక్ చేయాలి. ఫోన్‌పే లేదా గూగుల్ పే ఆధారంగా అక్కడ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి రుసుం చెల్లించాలి. చెల్లింపులు విజయవంతమైతే రసీదును డౌన్‌లోడ్ చేసుకోవాలి. తర్వాత అధికారులు విచారణ చేపట్టి అన్ని సక్రమంగా ఉంటే క్రమబద్ధీకరణ ప్రక్రియ పూర్తి చేస్తారు. నిషేధిత, ప్రభుత్వ భూములు, తప్పుడు డాక్యుమెంట్ తదితర సమస్యలుంటే దరఖాస్తును తిరస్కరిస్తారు. ఇది వరకే చెల్లింపులు చేసిన రుసుం మొత్తంలో 10 శాతం డబ్బులు కట్ చేసుకుని తిరిగి ఖాతాలో జమ చేస్తారు.

జుక్కల్‌లో బంజార భవన్ నిర్మిస్తాం



పూజ చేస్తున్న ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు

పిట్లం/నిజాంసాగర్/బిచ్కుంద : సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గంలో గిరిజనులు నడవాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు అన్నారు. పిట్లంలోని సాయి గార్డెన్ ఫంక్షన్ హాల్‌లో ఆదివారం మండల బంజార నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవాలాల్ మహరాజ్ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరయ్యారు. భోగ్ బండార్‌లో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జుక్కల్ నియోజకవర్గంలో బంజారా భవన్ నిర్మిస్తామన్నారు. జుక్కల్ మండలం బంగారుపల్లి, దోస్తుపల్లి గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ చేశారు. దోస్తుపల్లి గ్రామం నుంచి జుక్కల్ మండల కేంద్రం వరకు బీటీ రోడ్డు పనులను నాణ్యతగా చేపట్టాలని కాంట్రాక్టర్, ఆర్‌అండ్‌బీ అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. బిచ్కుంద క్లాసిక్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే పాల్గొన్నారు. షాదీఖానాల మరమ్మతులకు నిధులు మంజూరు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో బంజారా, కాంగ్రెస్ నాయకులు రమేష్‌దేశాయ్, సాయాగౌడ్, మల్లికార్జునప్ప షెట్కార్, విఠల్‌రెడ్డి, నాగ్‌నాథ్, గంగాధర్, నాగ్‌నాథ్ పటేల్, సాహిల్, గౌస్, పాషా,అజీం, ఖలీల్, నౌషా నాయక్, తుకారం పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలి



ప్రమాణం చేస్తున్న ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్, సునీల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి తదితరులు

బాల్కొండ: దేశంలో ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాలని ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ అన్నారు. బాల్కొండ, ముప్కాల్, మెండోరా మండల కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన జైబాపు, జై భీమ్, జై సంవిధాన్ సన్నాహక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం, ఆర్‌ఎస్‌ఎస్.. రాజ్యాంగాన్ని, రాజ్యాంగ నిర్మాతను అవమానపరుస్తుందన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అందుకోసమే ఈ నెల 27 నుంచి గ్రామగ్రామాన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు వెంకటేశ్‌గౌడ్, ముత్యంరెడ్డి, కొత్తింటి ముత్యంరెడ్డి, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

వారంతా పూర్వ విద్యార్థులు. ఏళ్ల క్రితం పదో తరగతి చదివి ఎక్కడెక్కడో స్థిరపడిన వారు.. మళ్లీ ఇప్పుడు ఓ చోట కలిశారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకున్నారు. గత మధురస్మృతులను నెమరువేసుకొని పరవశించిపోయారు. ఈ అపూర్వ ఘట్టానికి ఆదివారం ఉమ్మడి జిల్లాలోని వేర్వేరు ప్రాంతాలు వేదికలయ్యాయి.



వేల్పూర్ హైస్కూలులో సమ్మేళనానికి హాజరైన 1976-77 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు

వేల్పూర్‌లో 48ఏళ్ల తర్వాత..

వేల్పూర్: వేల్పూర్ మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1976–77 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. తమ బ్యాచ్‌కు 48 ఏళ్లు పూర్తికాగా, 2027లో 50 ఏళ్ల ఉత్సవం కుటుంబాలతో కలిసి జరుపుకోవాలని నిర్ణయించారు.

బీబీపేటలో 43 ఏళ్ల తర్వాత..

బీబీపేట: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 1981–82 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేసుకున్న విద్యార్థులు ఆదివారం అదే పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాఠశాల నిర్మాణ దాత సుభాష్ రెడ్డిని ఆహ్వానించారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పూర్వ విద్యార్థుల్లో చాలా మంది మనుమలు, మనుమరాళ్లతో కలిసి పాల్గొని ఆత్మీయంగా పలుకరించుకున్నారు.

ముప్కాల్‌లో ఉల్లాసంగా..

బాల్కొండ: ముప్కాల్ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1983–84 ఎస్సెస్సీ బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా అప్పటి ఉపాధ్యాయులను సన్మానించారు. చిన్నప్పటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ ఉల్లాసంగా గడిపారు.

నగరంలో ఆటాపాటలు..

నిజామాబాద్ అర్బన్: బ్రహ్మపురిలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయ 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆర్యవైశ్య పట్టణ సంఘం కన్యకా పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఆటాపాటలతో సందడి చేశారు. ఆనాటి పాఠశాల హెచ్‌ఎం చంద్రశేఖర్, ఉపాధ్యాయులు సేనాపతి వెంకట కుమారాచార్య, ప్రసాద్, గంగాకిషన్, విద్యార్థులు పాల్గొన్నారు.



బీబీపేటలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న 1981-82 పూర్వ విద్యార్థులు



బాల్కొండలో గురువులతో పూర్వ విద్యార్థులు



ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న నగరంలోని శ్రీ వేంకటేశ్వర విద్యాలయ పూర్వ విద్యార్థులు

తెయూ విద్యార్థికి 'సాహిత్య పురస్కారం'



తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ తెలుగు అధ్యయన శాఖ విద్యార్థి రాజు సాహిత్య పురస్కారం అందుకున్నారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలో ఆదివారం వెన్నెల సాహితీ సంగమం ఆధ్వర్యంలో నిర్వహించిన శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది కవి సమ్మేళనంలో రాజు పాల్గొన్నారు. తను రచించిన ఉగాది పండుగ కవితా రచనను సమ్మేళనంలో విన్పించగా వెన్నెల సాహితీ సంగమం ప్రతినిధులు, సాహితీప్రియులు, కవులు, రచయితలు రాజును ప్రత్యేకంగా అభినందించారు. కవితా రచనను ప్రోత్సహిస్తూ 'సురవరం ప్రతాపరెడ్డి సాహిత్య పురస్కారం', ప్రశంసాపత్రాన్ని అందజేశారు. పురస్కారాన్ని అందుకున్న రాజును తెయూ తెలుగు అధ్యయన శాఖ ప్రొఫెసర్ డీ కనకయ్య, అధ్యాపకులు అభినందించారు.

లింబాద్రి గుట్టను దర్శించుకున్న ఎన్నికల కమిషన్ కార్యదర్శి



మోర్తాడ్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి అశోక్‌కుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం భీమ్‌గల్ మండలంలోని లింబాద్రి గుట్టపై వెలిసిన లక్ష్మీ నర్సింహస్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అశోక్‌కుమార్‌కు ఆలయ వంశపారంపర్య వేద పండితులు నంబి పార్థసారథి, విజయసారథి స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలను చేయించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. వారి వెంట ఆలయ అర్చకులు నంబి వాసుదేవాచార్యులు, వేల్పూర్ వాసు, నంబి శ్రీనివాస్, రెవెన్యూ సిబ్బంది రావుట్ల అరవింద్, ఎడ్ల శ్రీకాంత్, సాయిలు తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

అబుదాబిలో రోడ్డు ప్రమాదం.. తొర్తివాసి మృతి



మోర్తాడ్(బాల్కొండ): దుబాయ్ దేశంలోని అబుదాబి నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఏర్గట్ల మండలం తొర్తికి చెందిన ఈర్ల గంగాధర్(44) మరణించినట్లు అతని సన్నిహితుల ద్వారా తెలిసింది. ఉపాధి కోసం అబుదాబిలో డెలివరీ బాయ్‌గా పని చేస్తున్న గంగాధర్.. శనివారం బైక్‌పై డ్యూటీకి వెళుతున్న క్రమంలో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. తీవ్ర గాయాలపాలైన ఆయన అక్కడికక్కడే మృతి చెందాడు. గంగాధర్‌కు భార్య, కూతురు, కొడుకు, తల్లి ఉన్నారు. గతంలో గీతా కార్మికునిగా పనిచేసిన గంగాధర్ ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టాడు. విధి వక్రీకరించి ప్రమాదంలో మృత్యువాత పడడంతో అతని కుటుంబం తీవ్ర విషాదంలో మునిగిపోయింది. మృతదేహాన్ని త్వరగా రప్పించి, బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

ప్రమాదవశాత్తు చెరువులో పడి వ్యక్తి..

బోధన్‌రూరల్: సాలూర మండలం జాడిజమాల్‌పూర్ గ్రామ శివారులోని చెరువు ప్రమాదవశాత్తు పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి తెలిపారు. గ్రామానికి చెందిన రమేశ్ ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లి ఇంటికి తిరిగివస్తుండగా గ్రామ శివారులోని చెరువులో కాలకృత్యాల కోసం వెళ్లి ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్ సిలిండర్ లీకేజీ.. ఒకరికి తీవ్రగాయాలు

రెంజల్(బోధన్): ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పైపు లీకేజీ కావడంతో మంటలు వ్యాపించి దంపతులకు గాయాలైన ఘటన రెంజల్ మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మోతీలాల్ ఇంట్లో మధ్యాహ్నం వంట చేస్తుండగా గ్యాస్ సిలిండర్ పైపు లికేజీ అయ్యి రెగ్యులేటర్ పేలింది. దీంతో మంటలు వ్యాపించి మోతీలాల్‌కు తీవ్రగాయాలు కాగా, భార్య లతకు స్వల్ప గాయాలయ్యాయి. ఇద్దరినీ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

బాలికపై లైంగిక దాడి

గాంధారి(ఎల్లారెడ్డి): మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికపై అదే గ్రామానికి చెందిన వేణు అనే యువకుడు లైంగిక దాడికి పాల్పడినట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. బాలిక కుటుంబీకుల ఫిర్యాదు మేరకు ఆదివారం కేసు నమోదు చేశామన్నారు. గ్రామంలో ఎల్లారెడ్డి డీఎస్పీ శ్రీనివాస్ విచారణ నిర్వహించినట్లు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

బోధన్‌రూరల్: సాలూర మండలంలోని మందర్న శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి ఆదివారం సాయంత్రం తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్లను సేష్టన్‌కు తరలించి కేసు నమోదు చేశామన్నారు.

మట్కా స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని మిర్చి కాంపౌండ్‌లో మట్కాస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆదివారం దాడి చేశారు. మట్కా ఆడుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద సెల్‌ఫోన్‌తోపాటు రూ.3900ల నగదు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ సీఐ అంజయ్య తెలిపారు.

హైలెవల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన డీసీఎం

బోధన్‌రూరల్: సాలూర మండల కేంద్రం సమీపంలోని బైపాస్ రోడ్డులో ఆదివారం బోధన్ నుంచి మహారాష్ట్ర వెళ్తున్న డీసీఎం వాహనం అదుపు తప్పి హైలెవల్ విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం డ్రైవర్ గాయాలపాలవ్వగా స్థానికులు 108లో ఆస్పత్రికి తరలించారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. నిత్యం వందలాది వాహనాలతో రద్దీ ఉండే బోధన్– సాలూర రోడ్డు అధికారులు అవసరమైన చోట హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పాపం బాలుడిని ఆదుకోరూ!

- లుకేమియాతో బాధపడుతున్న నిర్విన్ తేజ్
- ఆపన్నహస్తం కోసం తల్లిదండ్రుల ఎదురుచూపులు



నిర్విన్ తేజ్


డొంకేశ్వర్(ఆర్మూర్): పాఠశాల తరగతి గదిలో ఉండాల్సిన సమయంలో ఆస్పత్రిలో చేరి మహమ్మారి వ్యాధితో పోరాడుతున్నాడు బాలుడు నిర్విన్ తేజ్. డొంకేశ్వర్ మండలం గంగాసముందర్ గ్రామానికి చెందిన మోతె అశోక్, గంగామణిల కుమారుడు నిర్విన్ తేజ్ తొండాకూర్‌లో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఇటీవల సైకిల్ పైనుంచి పడడంతో కాలుకు పెద్ద గాయం తగిలింది. చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు రక్త పరీక్షలు చేశారు. అందులో తెల్లరక్త కణాలు ఎక్కువగా ఉండటంతో మరిన్ని పరీక్షలు చేయగా బాలుడికి (అక్యూట్ మైలోయిడ్ లుకేమియా) బ్లడ్ క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. ఆందోళనకు గురైన తల్లిదండ్రులు నాణ్యమైన వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఎంఎంజే ఆస్పత్రికి తీసుకెళ్లారు. వారం రోజులుగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. రోజుకు కొన్ని యూనిట్ల రక్తం అవసరం అవుతోంది. ఇప్పటికే రూ. నాలుగైదు లక్షల వరకు ఖర్చు అయింది. ఇంకా పదిహేను రోజుల వరకు వైద్యం అందించాల్సి ఉంటుందని వైద్యులు పేర్కొన్నారు. తల్లిదండ్రులది నిరుపేద కుటుంబం కావడంతో వైద్య ఖర్చులకు స్థోమత లేక ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారు. దాతలు ముందుకు వచ్చి తన కొడుకును కాపాడాలని వేడుకుంటున్నారు.

బ్యాంక్ అకౌంట్ వివరాలు..

తండ్రి: మోతె అశోక్
బ్యాంకు ఖాతా నంబరు: 75010100025228
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ : UBIN0817503
ఫోన్ పే నంబర్: 9705612610 (గంగామణి, తల్లి)

గేదెను తప్పించబోయి ట్రాక్టర్ బోల్తా

- ఒకరి దుర్మరణం



మాక్లూర్: అడ్డుగా వచ్చిన గేదెను తప్పించబోయి ట్రాక్టర్ అదుపుతప్పి బోల్తాపడగా ఒకరు మృతి చెందిన ఘటన ఆదివారం నందిపేట మండలం సీహెచ్ కొండూర్ శివారులో చోటు చేసుకుంది. నందిపేట పోలీసుల కథనం ప్రకారం.. వెల్మల్ గ్రామానికి చెందిన చిన్నోళ్ల సాయిలు(51) నిర్మల్ జిల్లా లోకేశ్వరం మండలం పంచగుడి వద్ద వ్యవసాయ భూమిని కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. నిత్యకృత్యంలో భాగంగా తన ట్రాక్టర్‌పై వెల్మల్ నుంచి పంచగుడిలోని పొలానికి వెళుతున్నాడు. సీహెచ్ కొండూర్ వద్ద ఒక్కసారిగా గేదె అడ్డురావడంతో దాన్ని తప్పించబోయే ప్రయత్నంలో ట్రాక్టర్ బోల్తా కొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న చిన్నోళ్ల సాయిలుకు తీవ్రగాయాలు కావడంతో అంబులెన్సులో జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సాయిలు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

భారత సాఫ్ట్‌బాల్ జట్టుకు విద్యార్థిని ఎంపిక



జక్రాన్‌పల్లి : మండలంలోని మునిపల్లి గ్రామానికి చెందిన గన్న వర్షిణి భారత సాఫ్ట్‌బాల్ అండర్–15 సబ్‌జూనియర్ జట్టుకు ఎంపికైంది. ఈనెల 25 నుంచి 30 వరకు తైవాన్‌లో జరిగే ఏషియన్ చాంపియన్‌షిప్ పోటీల్లో వర్షిణి పాల్గొననుంది. అంతర్జాతీయ పోటీల్లో భారత జట్టు తరపున వర్షిణి ప్రాతినిధ్యం వహిస్తుండడంతో మునిపల్లి గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు. మాజీ సర్పంచ్ ముస్కు చిన్న సాయిరెడ్డి ఆదివారం వర్షిణిని సన్మానించారు. ఖర్చుల నిమిత్తం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో లక్ష్మాపూర్ గ్రామశాఖ అధ్యక్షుడు నరేశ్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

ఆస్తి పన్ను చెల్లించని దుకాణాల సీజ్

బోధన్‌టౌన్(బోధన్): బోధన్ పట్టణంలో ఆస్తి పన్ను చెల్లించని పలు దుకాణాలను ఆదివారం బల్దియా అధికారులు సీజ్ చేశారు. అనిల్ టాకీస్ రోడ్డులోని కేకే సూపర్ మార్కెట్, లక్ష్మి అపార్ట్‌మెంట్‌లోని దుకాణ సముదాయాలతోపాటు మరో దుకాణ సముదాయాన్ని సీజ్ చేశారు. దుకాణాదారులు బల్దియాకు రూ.3,16,629ల ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో సీజ్ చేసినట్లు అధికారులు తెలిపారు. ఆస్తి పన్ను చెల్లించకపోతే దుకాణాలను సీజ్ చేస్తామని, ఇంటికి తాగునీటి సరఫరా నిలిపివేస్తామని హెచ్చరించారు.